# విప్లవ

హఠాత్తుగా విప్లవను చూసి తెల్లబోయాను.

తను ఒంటరిగా ఎలా రాగలిగింది?

ఎక్కడి బురకాయలకోట! ఎక్కడి ఢిల్లీ!

ఇంత పెద్ద నగరంలో మా యిల్లు తెలుసుకున్న వైనం మెచ్చుకోవాలి.

నేనలా తెల్లబోయి చూస్తూ ఉండగనే చొరవగా రేకుపెట్టె, జంబుఖానాలో చుట్టిన పక్కచుట్ట, చేతిసంచి గదిలోకి చేరవేసింది.

"బండి ఆలస్యమయింది" నుదుట పట్టిన చెమట తుడుచుకుంది.

"వదినేదీ? కనిపించదే? బాత్‌రూమ్ ఎక్కడ? నేను స్నానం చేసేస్తాను. ఆ లోపుగా ఈ కడుపుకేదైనా యింత అమర్చిపెట్టు."

సుజాత వంటింట్లో నుండి ఇవతలకు వచ్చింది "ఎవరొచ్చారండీ" అంటూ.

"వదినే! చాలా మారిపోయిందే! ఎప్పుడో పెళ్ళిలో చూసిన గుర్తు. తర్వాత మనం కలుసుకోనే లేదనుకుంటాను."

సుజాత ఇంతింత కళ్ళు చేసుకు చూస్తోంది.

"మా పిన్ని కూతురు. విప్లవకుమారి" అన్నాను నెమ్మదిగా.

తనకు కావలసినవేవో చూడటానికి సుజాత కదిలింది.

అసలు విప్లవ పేరు సరోజనమ్మ. మరి రాయలసీమలోని బురకాయల కోటలో పుట్టి పెరిగి విద్యాబుద్ధులు గడించిన సరోజ విప్లవ కుమారిగా ఎలా మారిందా అని మీకు సందేహం కలుగవచ్చు. దానికి కారణం వాళ్ళ అన్న వెంకటేశు. వాడు ఎనిమిదో తరగతి మూడోసారి చదువుతుండగా పిల్లల నోట్సులు, పెన్నులు, పెన్సిళ్లు కాజేసి అమ్ముకునేవాడట. ఒకసారి పట్టుబడ్డాడు. పంతులు దగ్గర తన్నులు తిని, ఇంటికి రాకుండా ఎక్కడికో పారిపోయాడు.

రెండేండ్ల తర్వాత ఒక శుభోదయాన ఊడిపడ్డాడు. ఏమంటే సర్కారు జిల్లాలన్నీ తిరిగొచ్చాడట. పెద్ద ఫారిన్ రిటర్నుడులా టెక్కు చూపించాడు. వాడి కోతలు... మాటలు... ఏమి నేర్చుకున్నా నేర్చుకోకపోయినా కాస్త రాగాలు తీస్తూ సొంపుగా సర్కారు తెలుగు మాట్లాడటం మొదలుపెట్టాడు. వాని దృష్టిలో చెల్లెలి పేరు

"సరోజనమ్మ" అన్నది ఏమీ బాగా లేదు. అందుకే విప్లవ కుమారి అని మార్చాడు. అదే స్థిరపడింది. ఇంట్లో వాళ్ళు "చిన్నపాప" అని పిలుస్తారనుకొంటాను.

సరే. విప్లవకూ, నాకూ ఉన్న బంధుత్వం మా అమ్మమ్మ, వాళ్ళ అమ్మమ్మ తోడికోడళ్ళుట. ఏ పెళ్ళిళ్ళలోనో కలుసుకోవటంగాక మాకేమంత సంబంధ బాంధవ్యాలు లేవు. ఎందుకంటారేమో? కరువునబడ్డ రాయలసీమలో ఎండిన భూమిని దున్ని, వళ్ళు వంచి పని చేస్తేనే ఎంత భూకామందుకైనా బొటాబొటీ సరిపోతుంది. ఇక ఆ మాత్రానికి దూరపు బంధువులతో రాకపోకలు పెట్టుకొని మర్యాద లెక్కడ జరుప గలరు? సాగితే నవాబంతటి దర్జా ఎవరైనా వెలగబెట్టవచ్చు. లేనికాడికి ఎవరికి వారే యమునా తీరే అని జీవితాలు వెళ్ళబుచ్చక తప్పదుగా.

ఐదారేండ్ల క్రితం మా వూరెళ్లినప్పుడు, ఒక పూట బురకాయల కోటకు కూడా వెళ్లాను. అప్పుడు చూశాను విప్లవను. తొమ్మిదో తరగతి చదువుతూ వుండేది. మరి ఆ పల్లెటూరిపిల్ల, ఒంటరిగా ఢిల్లీకి నా అడ్రసు వెతుక్కుంటూ వచ్చిందంటే ఆశ్చర్యమే మరి.

ఇంతలో తడి జుట్టు తుడుచుకొంటూ వచ్చినది విప్లవ. నేను చూసినప్పటికీ ఇప్పటికీ బాగా ఎదిగింది. పల్లెటూరిలో కాస్త గడ్డ పెరుగు, పేరిన నెయ్యి తింటూ పెరిగిందేమో, బొద్దుగా ఆకర్షణీయంగా వుంది. మంచి రంగొచ్చింది మనిషికి.

"ఈ మధ్య మీ ఊరినుండి సుబ్రమణ్యం వచ్చాడన్నయ్యా. అతనూ, నువ్వూ కలిసి చదువుకున్నారటగా. అతన్నడిగి నీ అడ్రసు తీసుకున్నాను. అప్పటి నుండి నీ దగ్గరకు వచ్చెయ్యాలనే."

"అవునూ ఇంత దూరం ఒంటరిగా నిన్నెలా పంపించారింట్లో వాళ్ళు?"

"ఇంట్లో వాళ్ళు పంపించకేం. నేనే వచ్చేశాను. శనక్కాయలమ్మిన డబ్బు యింట్లో వుంటే ఇన్నూరు రూపాయలు పట్టుకొచ్చాను."

నాకు గుండె దడ దడ లాడింది.

"ఇంట్లో దిగులు పడరటే?"

"ఏం దిగులుపడరు. జాబు వ్రాసి పెట్టొచ్చానులే. మా అన్న కూడా ముందిలా పారిపోయాడుట."

"ఉత్తరం వ్రాస్తానింటికి."

"వద్దు. నన్ను చంపుకు తిన్నట్లే. నాకేదో ఉద్యోగం చూసిపెట్టు. ఆపైన నేనే రాసుకుంటా."

"నీకు... ఉద్యోగమా?"

"నాకేమి తక్కువయింది? స్కూలు ఫైనలు ప్యాసయ్యానుగా. రెండేండ్లు వ్యర్థంగా ఇంట్లో కూర్చున్నా. లాభంలేదని నీ దగ్గర కొచ్చేశా. ఇంత పెద్ద ఉద్యోగస్తుడివి నాకో ఉద్యోగం చూపించలేవా?"

సుజాత భోజనానికి పిలవటంతో ఆ సంభాషణ ఆగిపోయింది.

ఆ రాత్రి పిల్లలిద్దరినీ పడుకోబెట్టి విప్లవకు పక్క సిద్ధంచేసి వచ్చింది సుజాత. నే నేదో చదువుకొంటున్నాను.

"ఏమిటి ఈ పిల్ల వ్యవహారం" అంది మెల్లగా.

"ఊరుకో. వినగలదు" అన్నాను.

"వినిపించదులెండి. అవతలి గదిలో ఫానుమోత కూడాను."

"ఇంట్లో చెప్పకుండా వచ్చేసింది. ఇక్కడేదైనా వుద్యోగం చూడమంటోంది."

"మీ రవేమీ పెట్టుకోకండి. పరాయి ఆడపిల్ల విషయంలో మన పెత్తన మెందుకు? కావాలంటే కొన్నాళ్లుండి ఊరు చూడనీ. తర్వాత కాస్త మంచి మాటలు చెప్పి ఇంటికి సాగనంపండి."

"నేనూ అదే అనుకొంటున్నా."

"అయినా ఎంతధైర్యం! బండ్లూ, వేళలు, టిక్కెట్లు అన్నీ ఎలా సమర్థించు కొందో? ఈ ఢిల్లీలో ఇల్లు కనుక్కోవటం మాత్రం ఏమంత సులభం! అమాయకంగా కనిపిస్తోంది గాని చాలా గట్టిదిలా ఉందండీ."

"దాని పేరే విప్లవం" అంటూ నవ్వాను.

* * *

టూరిస్టు బస్సులో ఊరంతా చూపించాను.

"ఎలాగూ ఇక్కడ ఉండేదేగా. ఇప్పుడే చూడక పోతేనేం" అంది విప్లవ.

ఐదారు రోజులు గడిచాయి. ఈమెను యింటికి పంపే మార్గం ఆలోచిస్తున్నాను.

"నా ఉద్యోగం సంగతేమిటన్నయ్యా" అంటూ వచ్చి కూర్చుంది.

అసలు విప్లవ రావటమే నా కేమంత ఆనందదాయకం కాదు. అది వచ్చిన తీరూ మెచ్చదగినదిగా లేదు. పోనీ పది రోజులుండి వెళ్తుందేమో ననుకుంటే ఈమెగారు వుద్యోగం చేస్తుందట. వందరూపాయల వుద్యోగం దొరకటం కష్టం

కాదు. కాని ఈ మహానగరంలో వంద రూపాయలకున్న విలువెంత? మా రెండు గదుల ఇంటి అద్దె రెండువందల యాభై రూపాయలు. నాకు స్కూటరున్నది గనుక బస్సుఛార్జీల గొడవలేదు. అయినా జేబు ఖర్చు వందరూపాయలకు తక్కువ కాదు. పెద్దవాడు రెండో తరగతి. చిన్నది కె.జి. వీరి యూనిఫారాలు, బడిజీతాలు వంద రూపాయలవుతున్నాయి. ఈ లెక్కని పేరుకు ఎనిమిది వందల జీతం వున్నా ఏదో గడచిపోతోంది అన్న లెక్కేగాని పెద్ద భోగభాగ్యాలు అనుభవించటం లేదు. విప్లవ వందరూపాయలు ఒక గది అద్దెకు సరిపోదే? ఆ తర్వాత తన ఖర్చులు? పోషణ?

ఈ విషయాలే నచ్చచెప్పాలని చూశాను. ఉహుం ఆమె వింటేనా.

"ఉద్యోగం రాగానే విడిగా వుంటానులే అన్నయ్యా, నా అంతట నేనెలాగో సర్దుకొంటాను."

ఎలా సర్దుకొంటుంది?

"ఏదో చూద్దాంలే" అన్నాను.

"చూద్దామంటే కుదరదు. పట్టుదలగా ప్రయత్నించు."

* * *

మరో రెండు రోజులు గడిచాయి. విప్లవకు టైపింగయినా రాదు. దీనికేం వుద్యోగం దొరుకుతుంది? నిజం చెప్పాలంటే "నా చెల్లెలికి ఏదో ఒక వుద్యోగం ఇప్పించండి" అని ఎవరినీ అడగటానికీ మొహం చెల్లటం లేదు. నేనేమో మొదటి తరగతి ఆఫీసరునాయె.

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి సుజాత కాస్త దిగులుగా కనిపించింది.

"చూడండీ మీ చెల్లెలు ఉదయమనగా వెళ్ళి ఇంతవరకూ రాలేదు."

"అరె, కొత్త చోట నువ్వెందుకు దాన్ని పంపించావు."

"అబ్బో, నేను పంపించా లేమిటి? అంత అణిగి మణిగి వున్న బిడ్డయితే ఇంత దూరం పారిపోయి వచ్చేదే కాదు!"

"ఎక్కడికి వెళ్ళిందో చెప్పిందా?"

"నాకు చెప్పకేం? నేను స్నానానికి వెళ్ళటం చూసి బాబిగాడితో 'పని ఉంది. బయటకు వెళ్తున్నానని అమ్మతో చెప్పరా' అని వెళ్ళిపోయిందట!"

ఎక్కడికి వెళ్ళి ఉంటుందా అని ఆశ్చర్యపోయాను. ఎండాకాలమేమో ఏడుగంటలయినా చీకటి పడలేదు. అయినా ఇప్పుడు ఎక్కడుందని వెతగ్గలను?

మొహమంతా చిరునవ్వు పులుముకొని ఏడున్నర ప్రాంతంలో వచ్చింది.

"అన్నయ్యా అన్నపూర్ణ స్టోర్సులో ఉద్యోగం దొరికింది."

"అదెక్కడ?"

"నీకు తెలీయదేమిటి? జనపథ్‌లో లేదూ?"

ఎక్కడి గ్రీన్‌పార్కు, ఎక్కడి జనపథ్! దీనికింత చొరవ, తెలివి తేటలు ఎక్కడివి?

"అక్కడ ఖాళీలున్నట్లు ఎలా తెలిసింది? తోడెవరొచ్చారు?"

"తోడేమిటి? ఎవరినడిగినా బస్సునంబరు చెబుతారు. పోతే ఈ రోజు స్కూటరులో (ఆటో) వెళ్ళాననుకో. ఉదయం పేపర్లో ప్రకటన చూశాను. తిన్నగా వెళ్ళి కలుసుకొని పని ముగించుకు వచ్చాను. నెలకు నూటయాభై యిస్తారట. సేల్సుగర్లు"

"ఛా. సేల్సుగర్లా? అవునూ దానికయినా భాషా అది రావొద్దూ."

"సేల్సు గర్లంటే లోకువెందుకూ? అడుక్కోనంత వరకు ఏ ఉద్యోగమయినా పర్వాలేదు. ఇక భాషకేముంది? ఎలాగూ హిందీ ప్రవేశిక పాసయ్యాను. కాస్త ఇంగ్లీషూ వస్తుంది. దానికేముందిలే అలవాటయితే సరి." అదే ఇంకో ఆడపిల్లయితే దాని ధైర్యసాహసాలకు కార్యదక్షతకు జోహారు లర్పించేవాడిని కాని ఈమె వద్దన్నకొద్దీ నాకు భారంగా ఉండదలుచుకున్న దేమిటో? మనవేపు సేల్సుగర్లు వుద్యోగానికి ఎవరు ముందుకొస్తారు చెప్పండి. కాస్త పరువుప్రతిష్ఠలు చూసుకోవద్దూ.

మరుసటి రోజు నాకంటే ముందే అదీ తయారయింది. బంగారు జూకాలు, రెండు పేటల గొలుసు తీసేసి, ప్లాస్టిక్కు దుద్దులు, గాజులు, ఎర్రటిపూసల దండ వేసుకుంది.

"బంగారంవి తీసేశావేం?" అంది సుజాత.

"ఇన్నాళ్లు ఢిల్లీలో ఉండి నీకు తెలిసిందింతేనా వదినా? ఇక్కడ బంగారం పెట్టుకోవటం ఫ్యాషను కానట్టుందే. నిన్న జనపథ్‌లో కొనుక్కున్నానివి. బాగా లేవూ?" అంది అద్దంలో ముంగురులు దిద్దుకొంటూ.

తనకు బస్సు స్టాపు చూపించి నా అంతట నేను ఆఫీసుకు వెళ్ళాను. దీని వ్యవహారం నాకేమీ బాగాలేదు. వాళ్లింటికి ఉత్తరం వ్రాసేద్దామా అనిపించింది.

ఆ సాయంత్రమేదో పార్టీ తగిలింది. కోవర్కరొకడు బదిలీ అయ్యాడు. కల్చరల్ ప్రోగ్రాం కూడా ఏర్పాటు చేశారు. ఇల్లు చేరే సరికి ఎనిమిదిన్నరయ్యింది.

సుజాత పిల్లలకు అన్నాలు పెట్తోంది. నన్ను చూసి పరుగున వచ్చింది.

"చూశారా ఎంతపని చేసిందో?"

"ఏమిటి?"

"అదే మీ చెల్లెలు నాలుగ్గంటలకు వచ్చి తన సామాను తీసుకొని వెళ్ళిపోయింది."

"ఎక్కడికి?"

"ఆ వివరాలన్నీ నాకు చెబుతుందేమిటి? తెలిసిన వాళ్ళెవరో కరోల్‌బాగ్‌లో గది యిప్పిస్తామన్నారుట."

"ఇంతలో దానికి తెలిసిన వాళ్ళెవరుంటారు?"

"మీ చెల్లెలేం నంగనాచి కాదు; ఈ రోజు ఉద్యోగానికి వెళ్ళిందిగా. ఎవరితోనో మొరపెట్టుకొని వుంటుంది."

"సామాను ఒక్కతే తీసుకు వెళ్ళిందా?"

"ఇంట్లోకి రావటం ఒక్కత్తే. బాబిగాడన్నాడు బయట టాక్సీలో ఎవరో ఒకాయన కూర్చుని వున్నాడని."

"డ్రైవరేమో?"

"చాల్లెండి మరీ వెనకేసుకొస్తున్నారు ఇంతోటి చెల్లెల్ని." సుజాత సంభాషణ పొడిగిస్తుందేమోనని అక్కడి నుండి వెళ్ళిపోయాను. నా గ్రహాలెంత కీడు చేస్తున్నాయో తెలీదు గానీ ఈ పిల్ల రూపంలో అన్ని బాధలూ చుట్టుముట్టున్నాయి. వాళ్ళింటికి ఏమని వుత్తరం వ్రాయను? "దానికి బుద్ధి లేకపోతే నీకుండొద్దూ." "ఇంట్లో నుంచి ఎలా పంపించావు" అని దులిపెయ్యరూ? ఏదీ తెలీనట్టు ఊరుకోవటం ఉత్తమమనిపించింది.

ఒకనాడు నేనూ, సుజాతా ఒక తెలుగు నాటకానికి బయలుదేరాం. ట్రాఫిక్ లైటు వద్ద ఆగిన మరో స్కూటరు చూపించి నా చేయి గిల్లింది సుజాత. నిజమే అది విప్లవే సందేహం లేదు. ముందర ఎర్రటి వాడొకడు నల్లజోడుతో కూర్చున్నాడు. వాడి భుజంపై చేయివేసి వెనక సీట్లో కూర్చుంది విప్లవ. చెవులకు ఇంత పొడవాటి లోలకులు, పెదవులకు, బుగ్గలకు రంగు. ఎత్తుగా చుట్టిన పెద్దముడి. ఇంతలో గ్రీన్ సిగ్నలొచ్చింది. ట్రాఫిక్‌లో ఆ స్కూటరూ కలిసిపోయింది. నాకు నవనాడులూ కుంగి పోయాయి. మరుసటిరోజు అన్నపూర్ణ స్టోర్సు వెతుక్కుంటూ వెళ్ళాను.

పంజాబీ డ్రెస్సు వేసుకున్న పిల్ల "క్యా చాహియే" అంది.

ఉలిక్కిపడి చూశాను. విప్లవే! ఆ జడతీరు కూడా హిందీ సినిమాలలోవలె వుంది. పెదవులకు గులాబి రంగు, అదే రంగుబొట్టు. బుగ్గలకు రోజ్, చెంపలపై వంకీలు తిరిగిన జుట్టు... పెన్సిలుతో దిద్దుకొన్న కనుబొమలు.

"నీవా అన్నయ్యా" అంది ఆశ్చర్యంగా.

"ఏమిటి మా స్టోరుపై ఇంత దయగలిగింది? ఏం కావాలో చెప్పు. ఇక్కడ మామూలుకంటె ధర తక్కువ. మంచి క్వాలిటీ. ఎందుకంటావేమో స్వలాభేపేక్ష తక్కువ...'

"నేనేమీ కొనటానికి రాలేదు. నీతో మాట్లాడాలి."

"ఇప్పుడా? బిజీ అవర్సు. సాయంకాలం ఆఫీసవగానే ఇటురా, నా గదికి తీసుకెళ్తాను."

సాయంకాలం వెళ్ళాను. ఆ ఎర్రటి కుర్రాడు కూడా అక్కడే వున్నాడు.

"వినోద్, మా రెగ్యులర్ కస్టమర్" అని పరిచయం చేసింది.

"రోజూ నన్ను స్కూటర్లో దింపుతాడు బస్సు గొడవ లేకుండా" అంటూ నవ్వింది.

"రా అన్నయ్యా, నీ స్కూటరుందిగా, మమ్మల్ని ఫాలో అవాలిప్పుడు."

చెంగున ఎగిరి ఆ వినోద్ స్కూటరుపై కూర్చుంది. స్కూటరు కదలగానే వాడి భుజంపై చేయి వేసింది.

కరోల్‌బాగ్‌లో గది చిన్నదయినా ముచ్చటగా వుంది. టీ పెట్టింది. డబ్బాలలోనుండి స్వీటు, మిక్చరు ప్లేట్లలో అమర్చింది. ఇంత వరకు ఒళ్ళు మండిపోతూ కూర్చున్నాను.

వినోద్ వెళ్ళిపోయాడు. "రేపు తొమ్మిదిన్నరకు... మామూలుగా" అని నవ్వాడు వెళ్తూ వెళ్తూ.

"నీ వ్యవహారమేమీ బాగుండలేదు" అన్నాను కటువుగా.

"ఏమయ్యిందిప్పుడు?"

"నువ్వు పుట్టి పెరిగిన వాతావరణం గుర్తుంచుకో. మరీ అంత నాగరికతతో విరుచుకుపడకు."

"తప్పేమిటో చెప్పరాదూ?"

"ఏమి చెప్పను? బురకాయల కోటలో ఇలా తిరిగితే, ఈ వేషాలు వేస్తే నిన్ను బతకనిస్తారా అక్కడివాళ్ళు? మొహాన ఉమ్మేసేవారీపాటికి."



కథా నిలయం
శ్రీకాకుళం

"అందుకనే ఆ పల్లెటూరు వదిలి వచ్చేశాను. తాతల కాలానికీ, నేటికీ అక్కడేమీ తేడా కనపడదు. సంకుచిత స్వభావాలు, ఓర్వలేనితనాలూను. ఇక వేషాలంటావ్... నాకు నచ్చింది నేను చేసుకుంటాను. కాకపోయినా సేల్సుగర్ల్‌కు ఆ మాత్రం గ్లామరుండాలి. అందరికీ ఈ వేషాలు అమరవు కూడా. తమకు లేనిది నేను పొందుతున్నానని నా మీదపడి ఏడుస్తారు చాలామంది. అది వాళ్ళకర్మ. అయినా జీవితమనగా ఎంత అన్నయ్యా? నిండా నూరేళ్ళు బతికినా నువ్వు నిజంగా జీవించగలిగింది ఇరవై ఏండ్లే. మొదటి భాగం రసంపట్టని చెరుకు, మిగిలింది పిప్పి చెరుకు. కనీసం జ్ఞాపకాలలో నెమరు వేసుకోవటానికైనా కొన్ని అనుభవాలు మిగలాలిగా."

"చెప్పావులే పెద్ద వేదాంతం. బోడి వేదాంతం. ఇంతకూ వాడితో నీ స్నేహమేమిటి?"

"అన్నయ్యా! ఇంత పెద్ద ఆఫీసరువి. కాస్త మర్యాదగా మాట్లాడలేవూ? వినోద్ మా కస్టమరు. తన ఆఫీసు కన్నాట్ ప్లేసులో వుంది. వెళ్తూ, వెళ్తూ దింపి వెళ్తాడు. కాస్త తోడుగా ఉంటాడు. ఇందులో ఆనందమే వుంది గాని బాధ కలిగించేదేమీ ఉన్నట్టు కనిపించలా."

"నీకు నోరుందే గాని నువ్వు వొట్టి అమాయకురాలివే విప్లవా! పల్లెటూర్లలో మగవాళ్ళు కాస్త సంఘానికి జంకుతారు. ఇక్కడ నాగరికత పేరుతో అవసరానికి మించి చనువు దీసుకొని నీలాంటివాళ్ళ జీవితాలతో ఆడుకుంటారే!"

"వినోద్ అలాంటివాడుకాడు. బాగా చదువుకున్నవాడు. ఉద్యోగస్తుడు, ఇంత పెద్ద ఊళ్లో దిక్కులేకుండా వుంటే గది చూపించి, అన్నీ అమర్చి కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. తనకంటె ఆప్తులింకెవరంటావు?"

"నీకు దిక్కులేక పోవటమేమిటే? మా యిల్లు నీవే వదిలిపెట్టి వచ్చేశావుగా."

ఒక్కక్షణం నా కళ్ళలోకి చూసి నవ్వేసింది. "నాకు తెలుసు అన్నయ్యా, నేను వచ్చినప్పటినుండి నీ మనసు మనసులో లేదు. మా వదినయితే 'ఇదెక్కడి పీడా?' అని దిగులు పడుతోంది. మొగమాటం కొద్దీ, మనసులో తిట్టూ, శపిస్తూ దగ్గరుంచుకునే బంధువులకంటే నిర్మొహమాటంగా ప్రవర్తించే స్నేహితులు ఆప్తులు కాదా అన్నయ్యా?"

"నీ కళ్ళిప్పుడు మూసుకుపోయాయి. వాడు మోసం చేస్తేగాని ఎవరాప్తులో తెలిసిరాదు."

"నీ సహాయం లేకుండా సుఖపడిపోతున్నాని నీ బాధ. నీ ఛాందస భావాలకు అనుగుణంగా నడవలేదని కోపం. పోనిద్దూ, నా బతుకునాది. ఎదురు దెబ్బ తగిలినా నేనే బాధపడతాను కాని నిన్నేమీ నిందించను."

కోపంతో వచ్చేశాను. విప్లవ పాడయింది... పూర్తిగా పాడయింది. అది సర్వనాశనమయి పోతుంది త్వరలో. ఆ వినోద్‌గాడు తప్పక దీన్ని దగా చేస్తాడు. నిజంగానే దగా చెయ్యాలి. అప్పుడుగాని దీని పొగరణగదు... సుజాతకు ఈ విషయాలేవీ చెప్పలేదు.

* * *

ఆరు నెలలు గడిచాయి. ఆ రోజింటికి వచ్చేసరికి సుజాత ధుమధుమలాడి పోతూ ముక్కు చీదుకొంటుంది.

"ఏమిటి కథ?" అన్నాను.

"కథలాగే వుందిబతుకు. ఇన్నేండ్లు బతికి చివరకు చీ! ఛీ! కుక్కబతుకు. ఇటువంటి పనులు మా యింటా వంటా వున్నాయా నిప్పులాంటి వంశం..."

"అదేమిటో సరేగా చెప్పి ఏడవరాదూ"

"ఏడుస్తూనే వున్నా వేరే చేసేదేముంది? ఆ మహారాణి వచ్చి వెళ్ళింది."

"ఎవరూ?"

"ఎవరేమిటి? నేలనున్నది నెత్తికి రాసుకున్నట్లయింది. ఇదెక్కడి బంధుత్వం... ఏమిటిలా గుర్రుమని చూస్తారు... ఆ వగలాడి లేదూ విప్లవ కుమారి."

"వస్తే ఏమిటట?"

"దానికి మూడు నెలల కడుపు. ఏమి చేయనొదినా అని బుడి బుడి ఏడ్పు లేడ్చింది. ఈ మాత్రం ఇంగితం ముందు లేదూ? 'నీ వెంత నీ ఇల్లెంత' అన్న ధోరణిలో వెళ్లింది. ఈనాడీ దిక్కుమాలిన వాళ్ళందరికీ మనమే కావలసి వచ్చాం."

"అబ్బ నోరు మూసుకుందూ."

"మూసుకుంటాను. రేపు పదిమంది మొహాన ఉమ్మినపుడూ నోరు మూసు కుంటాను. ఆ చెల్లెలి అన్నగారేగా. రక్త సంబంధం, అ బుద్ధులుండక పోతాయా..."

స్కూటర్ వేసుకొని చర్రున కరోల్‌బాగ్ వైపు బయలుదేరాను. నా మనసు కుతకుత లాడిపోతోంది. అయినా నింపాదిగా ఆలోచించాను. ఇటువంటి సమయంలో తనను నిర్దాక్షిణ్యంగా వదిలేస్తే ఎలా? మా యింట్లో వుంచుకోవటానికి

వీలు లేదాయె, పరువుమాట అటుంచి, సుజాత ఇద్దర్నీ రాచి రంపాన పెట్టగలదు. నేను ఎన్ని చలం పుస్తకాలు చదవలేదు! ఎంత విశాల దృక్పథం అలవరచుకోలేదు! విప్లవ పని సుజాతకు ఒళ్ళు పొగరు, కండకావరముగానే కనిపిస్తుంది. సుజాతకే కాదు చాలా మందికి అంతే. దానికేం పదహారో ఏట పెళ్ళయి ఇద్దరు పిల్లల్ని కనింది. ఫ్యామిలీ ప్లానింగు పుణ్యమా అని ఏ బెడదా లేకుండా దానికి కావలసిన సుఖం అది పొందుతూనే వుంది. విప్లవ లాంటి వాళ్ళు దాని కళ్ళకు తుచ్ఛులూ, పతితలూను. నిజానికి స్త్రీ పరిస్థితి సంఘంలో దారుణంగానే వుంది. పెండ్లి పేరుతో పిల్లల్ని కనటం ప్రతిష్ఠ. ఆ పబ్లిసిటీ, లైసెన్సు (పెళ్ళి) లేనప్పుడు స్వభావ సిద్ధమైన పనులు, ప్రకృతి మార్పులు, తప్పిదాలు, పాపాలు అయిపోతాయి. అరె... ఏమిటి నేనిలా ఆలోచిస్తాను? ఇదంతా చలం ప్రభావమయి వుంటుంది. వెర్రి బాగులది. విప్లవ ఎంత దుఃఖ పడుతుందో? క్షమించన్నయ్యా అని నా కాళ్ళు పట్టుకుంటుంది. దానికి చాలా కష్టమే వచ్చిపడింది. అయినా మా యింటికి తీసుకెళ్ళి ఎలా పెట్టుకోను. రేపు పదిమంది నన్నడగరూ? వాడెవడో కనుక్కొని దానికీ వాడికీ పెళ్ళిచేస్తే సరి, అవును ఏదోవిధంగా వాడికి నచ్చచెబుతాను. ఎంత డబ్బు ఖర్చయినాసరే... డబ్బు... అవును మరి తప్పుతుందా?

తలుపు ఓరగా వేసి ఉంది. తీసి లోపలికి వెళ్లాను. మంచం మీద పడుకుని ఏదో ఆలోచిస్తోంది విప్లవ. నన్ను చూడగానే చర్రున లేచింది.

"ఏం నీ భార్య చేసిన అవమానం చాలక నీవూ వచ్చావా? ఆడది, బిడ్డల తల్లి నా బాధ అర్థం చేసుకోదా అని వచ్చాను. ఎన్నెన్ని మాటలంది? ఎంత దూషించింది. అది చాలక నిన్ను పురెక్కించి పంపిందా?"

"కూర్చో. ఊరికే ఉద్రేక పడకు" అసలు దీని కళ్ళలో నీళ్ళయినా లేవే! దుఃఖంతో మతి చలించలేదు కదా!

"నాకేం ఉద్రేకంలేదు బాగానే వున్నాను."

"అదే... అదే... నాకు కావలసింది. ఇంతకూ ఆ వినోద్ గాడి పనేనా ఇదంతా? చెప్పు వాణ్ణి నాలుగు తన్నయినా నీ పెళ్ళి వాడితో జరిపిస్తాను."

"వినోద్... ఒక గుటక మింగింది."

"చెప్పమ్మా చెప్పు... ఏమీ దాచుకోకు."

"దాచుకునే దానికేముంది అంత కుతూహలంగా అడుగుతున్నావు. ఇంతకూ నీవేమీ శ్రమపడ నక్కరలా. అతగాడు నన్ను ప్రాధేయపడ్డా నేనీ పెళ్లిచేసుకోను."

"అదేమిటి? వాడి కాళ్లమీదపడి ఈ పెళ్ళి జరిపించుకోక బెట్టుపోతావెందుకు? నువ్వింక దేనికి పనికొస్తావు? నిన్ను దగ్గరుంచుకు ఎవరు పోషిస్తారు? నీ బిడ్డ భవిష్యత్తేమిటి?"

అబ్బ! చురకత్తిలాంటి చూపు దానిది.

"అవునులే దేనికీ పనికిరాను. కాలుకుంటా? కన్ను గుడ్డా? ఏమయిందిప్పుడు నాకు? ఇక ఆ వినోద్ సంగతా? ఎప్పుడయితే ఈ బాధ్యత తప్పించుకోవాలని చూశాడో అప్పుడే అతనిపై నమ్మకం పోయింది. అటువంటి కపటితో జీవించటం కంటె ఆత్మహత్య మేలు. అయితే నేను చస్తాననుకోకు. నాకు ప్రాణం మీద తీపి వుంది. నా బిడ్డపై మమత వుంది. ఒకసారి దెబ్బతింటే, గాయం మాన్పుకోవటం బుద్ధిమంతుల లక్షణం గాని దాన్ని అనునిత్యం కెలుకుతూ కూర్చుని ఏడవటం ఆదర్శమనుకోను. ప్రస్తుతం నాది క్లిష్ట పరిస్థితే. అయినా ఎదుర్కొంటాను. నీ వంటి విశాలహృదయులు తిడ్తూ, శపిస్తూ చూపించే దయా దాక్షిణ్యాలు నాకక్కరలేదు. నా వంటి నిస్సహాయులను ఆదుకొనే సంస్థ ఒకటి వుంది. దాని అడ్రసు సంపాయించాను. అక్కడే అన్నీ సవ్యంగా జరుపుకొని జీవితంలో నిలబడతాను. ఇంతా చేసి నా వయసు ఇరవై రెండేళ్లేగా, భవిష్యత్తంతా ముందే ఉంది. ఎప్పుడో నన్ను త్రికరణ శుద్ధిగా ప్రేమించేవాడు దొరుకుతాడనీ, అతనితో నేను సుఖపడతాననీ నా ప్రగాఢ విశ్వాసం"

ఎంత హుందాగా మాట్లాడింది!

బాబోయ్ ఇది ఆడది కాదు. బ్రహ్మ రాక్షసి. దీనికేం గుండెలు తీసిన బంటు. బాగానే బతగ్గలదు. అందరూ ఇటువంటి వాళ్లయితే ఇక లోకం బాగు పడ్డట్టే. కానీ దీని పాపాలు పండకపోవు. భగవంతుడు శిక్షించకపోడు. మనోవేగంతో స్కూటరుపై ఇంటికి వచ్చిపడ్డాను.